మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## దేశానికి రోల్ మోడల్‌గా..

# భూ భారతి

### రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్ కార్పొరేషన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మహిళతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**మద్దూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** దేశంలో భూభారతి చట్టం రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, పౌర సమాచార సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి రైతుకు భరోసా, భద్రత కల్పించాలని ఎన్నో రాత్రులు నిద్ర పోకుండా మేధావులతో కలిసి భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలం ఖాజీపూర్ గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టానికి, భూభారతి చట్టానికి ఎంతో తేడా ఉందని, భూ భారతి చట్టం రైతు భూ సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. తమ భూములు ధరణి వల్ల ఇంకా తమ పేరిట నమోదు కాలేదని ప్రతి పక్ష శాసన సభ్యులే అసెంబ్లీలో తనను అడిగారని, కానీ ప్రతిపక్ష నేత శాసన సభలో భూభారతి చట్టానికి ఆమోదం తెలపకుండా అడ్డుపడ్డారని విమర్శించారు. ధరణి చట్టం వల్ల ప్రజలు అధికారుల వద్దకు వెళ్లాల్సి ఉండేదని, కానీ భూభారతి చట్టం వల్ల ప్రజల వద్దకే అధికారులు వారి వారి గ్రామాలకు వచ్చి ఒక్క రూపాయి తీసుకోకుండా భూ సమస్యలను పరిష్కరిస్తారని మంత్రి తెలిపారు. రైతుకు, భూమికి మధ్య ఉన్న బంధాన్ని ఈ చట్టం ధృడం చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ధరణితో వేలాది ఎకరాలను కొల్లకొడితే, భూ భారతి ద్వారా అర్హులైన పేదలకు భూములు పంచాలనే ఆలోచన తమ ప్రజా ప్రభుత్వానిది అన్నారు. అసైన్డ్ భూములకు కూడా హక్కులు కల్పిస్తామన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్ఏ, వీఆర్వో వ్యవస్థను కుప్ప కూల్చిందని, కానీ ఈ ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవిన్యూ అధికారిని నియమించి, అర్హులైన వారిని మళ్లీ తీసుకువచ్చి గ్రామాల్లో ఇలాంటి భూ సమస్య ఉన్నా అక్కడే పరిష్కారం చూపిస్తామన్నారు. కోర్టులో లేని ప్రతి భూ సమస్యను పరిష్కరించడమే భూభారతి ముఖ్య ఉద్దేశమన్నారు. ఎవరి పేరుతో ఎంత భూమి ఉందో అది వారికే చెందేలా చూస్తామన్నారు. మొదటి విడత 6 వేల మంది లైసెన్స్ డ్ సర్వేయర్లను ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇచ్చి మ్యాప్ పై సర్వేయర్ సంతకంతో కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో, మనస్సాక్షిగా పేదవారికి మేలు చేయాలని అద్భుతమైన ఈ చట్టాన్ని చేసుకున్నామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలే కలెక్టర్లను పిలిచి భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని స్పష్టంగా చెప్పారన్నారు. మొదటగా 4 మండలాలను పైలెట్‌గా తీసుకున్నామని, మే 1 నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాలకు జిల్లా కలెక్టర్లు వెళ్లి ఈ చట్టం గురించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అయితే జూన్ 2 లోపు ఎంపిక చేసిన మొదటి నాలుగు పైలెట్ గ్రామాల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి ఇదే పద్ధతిలో అధికారులే రైతుల వద్దకు వస్తారన్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా ప్రతి రైతుకు పూర్తి భద్రత కల్పిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం ప్రజలకు అండగా ఉంటుందన్నారు. తాము అమలు చేస్తున్న కొత్త భూభారతి చట్టాన్ని ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు కూడా వినియోగించుకోవచ్చని మంత్రి సూచించారు. తమ భూ సమస్యల గురించి తనతో చెప్పిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, చెప్పని వారు కూడా కొత్త చట్టం వినియోగించుకుని సమస్యలు పరిష్కరించుకోవచ్చని సలహా ఇచ్చారు. ధరణితో ప్రజలు ఎంత ఘోష పెట్టారో భూ భారతి అమలు లోకి వచ్చిన తర్వాత తెలుస్తుందన్నారు. ప్రభుత్వం ఏదైనా మంచి పని చేస్తే మంచి చేసిందని చెప్పకపోయినా పర్వాలేదు కానీ మంచిని చెడుగా చెప్పి ప్రచారం చేస్తే మాత్రం ప్రతిపక్షానికి వచ్చే ఎన్నికలలో రెండు అంకెల సీట్లు కూడా రావని, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాల మాదిరిగా శాసన సభ ఎన్నికలలో రిపీట్ అవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముందు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణి స్థానంలో సరళమైన భూ భారతి పోర్టల్‌ను ఈ నెల 14 న ప్రారంభించిందని, అందులో భాగంగా నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండలాన్ని పైలెట్ మండలముగా ఎంపిక చేసిందని తెలిపారు. భూ పరిపాలనలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పోర్టల్‌ను జిల్లా అధికార యంత్రాంగం, ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తామని చెప్పారు. సమస్యల తక్షణ పరిష్కారంలో భాగంగా తీసుకొచ్చిన ఈ సంస్కరణలు అమలు చేసేందుకు నారాయణపేట జిల్లాకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికీ, రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా ప్రజల తరపున కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు డా. వాకిటి శ్రీహరి, డా. చిట్టెం పర్ణికా రెడ్డి, బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతాదయాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎనుముల తిరుపతి రెడ్డి, భూభారతి ప్రత్యేక అధికారి యాదగిరి, ప్రిన్సిపల్ సెక్రెటరీ రెవిన్యూ శాఖ, జ్యోతి బుద్ధ ప్రకాష్, ఐఏఎస్, ప్రిన్సిపాల్ సెక్రటరీ రెవిన్యూ శాఖ,సీసీ ఎల్ఏ సెక్రెటరీ మంద మకరంద్ ,జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్,జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, న్యాయవాది భూమి సునీల్, ఆర్డీఓ రామచందర్ నాయక్, డిసిసి అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మద్దూరు సింగిల్ విండో చైర్మన్ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

### బ్యాంక్ గ్యారంటీ ఇచ్చే మిల్లర్లకే

# యాసంగి వరి ధాన్యం

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్.చౌహాన్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మిల్లర్లు ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన ధాన్యం క్లియర్ చేసి బ్యాంక్ గ్యారంటీ ఇచ్చే మిల్లర్లకే యాసంగి వరి ధాన్యం కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు, సియంఆర్ అప్పగింత పై గురువారం అదనపు కలెక్టర్లు రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. మిల్లర్లు ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన సియంఆర్ ధాన్యం అప్పగింత పై ప్రత్యేక దృష్టి సారించాలని త్వరితగతిన అప్పగింత పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలలో నిర్దేశించుకున్న మేరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తగిన శిక్షణ ఇవ్వాలని తెలియజేశారు. డిఫాల్ట్ మిల్లర్లు, బ్యాంక్ గ్యారంటీ ఇవ్వని రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించేది లేదని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 481 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని ఇందులో 379 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 95 కొనుగోలు కేంద్రాల ద్వారా 2500 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసి 800 మెట్రిక్ టన్నుల ధాన్యం గోదాముల్లో నిల్వ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 178 మిల్లులు ఉండగా చాలా వరకు డిఫాల్ట్ అయి కేసులు నమోదు చేసి ఉన్నాయని తెలిపారు. యాసంగి ధాన్యం కేటాయించేందుకు ప్రస్తుతం 11 మిల్లులతో ఒప్పందం చేసుకోవడం జరిగిందని, ఇంకా బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వలేదని తెలిపారు. డిఫాల్ట్ మిల్లర్లకు సైతం ఎఫ్‌సిఐకి ఇవ్వాల్సిన పాత బకాయిలు క్లియర్ చేసి బ్యాంక్ గ్యారంటీ ఇస్తే ధాన్యం కేటాయిస్తామని మిల్లర్లకు మరో అవకాశం కల్పించినట్లు తెలియజేశారు. ఏప్రిల్ నెల చివరి నుంచి జిల్లాలో వరి కోతలు అధికమవుతాయని తెలియజేశారు. సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డీఆర్డిఒ పిడి ఉమాదేవి, జిల్లా కోఆపరేటివ్ అధికారి బి.రాణి, సివిల్ సప్లై డియం జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్లు రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

## నిరుపేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

### దళితవాడలో నరసమ్మ ఇంట్లో సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 17 ప్రభాత వార్త :** నిరుపేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మారుమూల ప్రాంతాల్లోని పేదలు సైతం ఎమ్మెల్యే, ఎంపి, కలెక్టర్లు, సంపన్నులు తినే భోజనాన్ని తినాలన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రం దళితవాడలోని నరసమ్మ ఇంట్లో ఆయన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే సన్నబియ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగం చేసుకోవాలన్నారు.



దళితవాడలో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

## భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

**గద్వాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. గురువారం గద్వాల్ మార్కెట్ యార్డులోని భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని, భూ భారతి చట్టంపై, అందులోని అంశాలపై వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి భూ వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని -మిగతా4లో..



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్



అవగాహన సదస్సులో పాల్గొన్న ప్రజలు

## బాబోయ్ పులులు...

### పట్టించుకోని అటవీ అధికారులు.. భయాందోళనలో చుట్టుపక్కల గ్రామాలు..

**నవాబుపేట,ఏప్రిల్17 ప్రభాతవార్త :** మండల పరిధిలోని యన్మన్ గండ్ల సమీపంలోని దేవరగుట్టలోని గుహల్లో ఆవాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్న చిరుతలు దాదాపు వారం రోజుల నుండి గుట్ట సమీపంలోని ఇటుక బట్టీల వద్ద పశువుల పాకల వద్ద,మామిడి తోటల వద్ద కాపలాగా ఉంటున్న శునకాలను చంపుతున్నాయి. గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు పాకలలో కట్టేసి ఉంచినా వాటి జోలికి పోకుండా శునకాల రక్తానికి రుచిమరిగిన చిరుతలు వాటిపైనే దాడులు చేస్తూ వాటి మాంసాన్నే భక్షిస్తూ వాటి - మిగతా4లో..



గుట్టల మధ్య రక్తపు మరకల ఆనవాళ్లు

### డి 2 ప్రాంతంలో కొనసాగుతున్న

# మట్టి తవ్వకాలు

### టన్నెల్ ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగంలో జరిగిన ప్రమాద ప్రదేశంలోనీ డి2 ప్రాంతంలో సహాయక చర్యల్లో భాగంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామంలోని ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలపై టన్నెల్ ఇన్లెట్ 1 ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ తెలుసుకునేందుకు డి1, డి2, ప్రాంతాలలో అన్వేషణ జరిగిందని, ప్రస్తుతం డి2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో మట్టి తవ్వకాలు టిబిఎం కత్తిరింపు పనులు జరుపుతూ కార్మికుల జాడకై నిరంతరం సహాయక బృందాలు శ్రమిస్తున్నట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలియజేశారు. డి2 ప్రాంతంలో 5 ఎస్కవేటర్ల సహాయంతో పెద్ద పెద్ద బండ రాళ్లను తొలగిస్తూ, అత్యధికంగా ఉన్నటువంటి మట్టిని కన్వేయర్ బెల్ట్ గుండా టన్నెల్ బయటకి పంపుతున్నట్లు, ఊట నీటిని నిర్విరామంగా బయటకు పంపించేస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల ప్రమాదం సంభవించిన ప్రాంతాన్ని నిషిద్ధ ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేసినట్లు, టన్నెల్ నిపుణులు ప్రమాద ప్రదేశాన్ని నిరంతరం పరిశీలనలో ఉంచినట్లు, సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బందికి తగు జాగ్రత్తలు సూచించినట్లు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి వివరించారు. మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న బండ రాళ్లను టీబీఎం భాగాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ సహాయక చర్యలు వేగవంతం చేసినట్లు ప్రత్యేక అధికారి వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో కేంద్ర రాష్ట్ర సహాయక బంధాల ఉన్నతాధికారులు జేపీ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేనూ భూభారతిలో దరఖాస్తు చేసుకుంటా..

- ధరణి వల్ల రెవెన్యూ శాఖలో చిక్కులు
- పేద ప్రజల భూ సమస్యల పరిష్కారానికి నాంది
- జడ్చర్ల భూభారతి అవగాహన సదస్సులో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, భూమి సునీల్

**జడ్చర్ల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం కానున్నట్లు జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి అన్నారు. భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం2025) పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి గురువారం నుండి ప్రారంభమైన అవగాహన కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల మండల కేంద్రం చంద్ర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు జిల్లాలో జడ్చర్లలో ప్రారంభం కావడం సంతోషకరం అన్నారు. పేద రైతుల కోసం భూ భారతి చట్టం వచ్చిందని, ఆ చట్టం తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరగకుండా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ఏ సమస్య అయినా భూ భారతి ద్వారా పరిష్కారం అవుతుందని తెలిపారు. రైతులకు మేలు జరిగేలా, ఎలాంటి భూ వివాదాలు లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు ఎన్నో రోజులు సమాలోచనలు చేసి మేధావులు, అధికారులు అందరితో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. గతంలో ధరణి ద్వారా భూ సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. తాను,తన తల్లి కొనుగోలు చేసిన భూములకు ధరణి ద్వారా ఎదుర్కొన్న ఇబ్బందులను సమావేశంలో ఆయన వివరించారు. ధరణి ద్వారా తప్పుడు ఏ.జి..పి.లతో దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిగిన ఉదంతాలు తెలిపారు. ధరణిలో ఉన్న లోపాలు సవరించి భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి అర్ఓఅర్ చట్టం తీసుకు వచ్చిందని అన్నారు. ప్రతి రోజూ గ్రామాల్లో ప్రజల నుండి వచ్చే సమస్యల్లో 90 శాతం భూ సమస్యలు అని తెలిపారు. పేద రైతులకు భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ అధికారులు చిత్త శుద్ధితో భూ భారతి చట్టం ద్వారా పేద రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ భూ భారతి చట్టంను ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా అమలులోకి వచ్చిందని అన్నారు భూభారతి చట్టం పేద రైతులకు చేరేలా అవగాహన కల్పించాలని అన్నారు. అందరి అభిప్రాయాలు సేకరించి, చర్చించిన పిదప ఈచట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులలో ఎక్కువగా భూ సమస్యలతో వస్తున్నట్లు తెలిపారు. ధరణిలో తప్పొప్పుల సవరణకు రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు లేవని,సమస్యలు తీరాలంటే కోర్టులను ఆశ్రయించవలసి వచ్చేదని అన్నారు. సర్వే నెంబర్‌లు మిస్ అవడం,తెల్ల కాగితం మీద రాసుకొని కొనుగోలు చేసిన భూములకు ఎటువంటి హక్కులు లేవని,ఇనాం భూములకు ఓ.అర్.సి.38 ఈ సర్టిఫికెట్ మొదలగు మార్గాల ద్వారా భూమి హక్కులు సంక్రమించినప్పుడు ధరణిలో నమోదుకు ఎలాంటి నియమాలు లేవని తెలిపారు. అన్ని భూ సమస్యలకు భూ భారతి పరిష్కారం చూపుతుందని అన్నారు. ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు లాగానే ప్రతి భూమికి భూదార్ కార్డ్ జారీ చేయడం జరుగుతుందన్నారు.భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. తహశీల్దార్ దగ్గర పరిష్కారం కాకుంటే ఆర్.డి.ఓ కు, ఆర్.డి.ఓ దగ్గర కాకుంటే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చని అన్నారు జిల్లా కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే భూమి ట్రిబ్యునల్ కు రెండవ అప్పీల్‌కు వెళ్ళవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యూటేశన్ చెయ్యడానికి ముందు భూములసర్వే మ్యాప్ తయారీ చేయడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా రెవెన్యూ -మిగతా4లో..



భూభారతి సదస్సు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి,చిత్రంలో కలెక్టర్ విజయేంద్ర బోయి

# ఆగని కబ్జాలు... అడిగే వారే లేరా?

- కబ్జాకు గురవుతున్న ప్రధాన డ్రైనేజీ స్థలం
- దారికి అడ్డంగా స్తంభాలు పాతిన ఘనులు
- నిద్రావస్థలో మున్సిపల్ అధికారులు
- కబ్జాపై చర్యలు తీసుకోవాలని
- కోరుతున్న కాలని వాసులు

**గద్వాల టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** గద్వాల పట్టణ ప్రాంతంలో రోజు రోజు కబ్జాల పరంపర కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం తో కబ్జా దారులు మితిమీరి పోతున్నారనీ విమర్శలు విన్పిస్తున్నాయి. నిన్న రాజుల కాలంనాటి కొత్తబాయి, మొన్న కుంటవీధిలో పది శాతం స్థలం, ఆ మొన్న చిత్తరివీధి రహదారి స్థలం, పాత హౌసింగ్ బోర్డు లో ప్రభుత్వ స్థలం ఇలా చాలా ప్రాంతాలలో కబ్జా దారులు కబ్జాలు చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సంబధిత అధికారులు పట్టించుకోవడం లేదని, అడిగే నాథుడే కరువయ్యాడనీ అందుకే జిల్లా కేంద్రంలో కబ్జా దారులు మితిమీరి పోతున్నారని పుర ప్రజలు వాపోతున్నారు. నేడు పట్టణంలో భీం నగర్ కాలనీ సమీపంలో గల ప్రధాన డ్రైనేజీ స్థలం, డ్రైనేజీ పక్కనే అనుకొని వున్న రహదారి స్థలం కబ్జాకు గురవుతుందని, ఇలా కళ్ళముందు విలువైన ప్రభుత్వ భూములు, పది శాతం మిగులు స్థలాలు, కబ్జాలు జరుగుతున్న ఒక్కదాని పైన అయినా అదికారులు చర్యలు తీసుకుంటూన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత పది సంవత్సరాలకు పైగా డ్రైనేజీ పక్కనే రహదారిలో ప్రజలు రాక పోకలు కొనసాగిస్తున్నారు. గత మున్సిపల్ ప్రజా ప్రతినిధుల పాలనలో ఆ రహదారి మధ్యలో డ్రైనేజీ వుండడంతో దానిపై రాక పోకలకు వీలుగా చిన్న డ్రైనేజీ పై సి.సి స్లాబ్ వేయించి దారి కల్పించారు. వాస్తవంగా ఆ స్థలం పై ప్రస్తుత కబ్జా దారునికి నిజమైన హక్కు వుంటే ఆయన స్థలంలో సిసి స్లాబ్ వేస్తుంటే ఎందుకు అడ్డుకోలేదనీ కాలని వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు వచ్చి స్థలం నాది అని ఇష్టానుసారం దారికి అడ్డంగా స్తంభాలు పాతి, ప్రధాన డ్రైనేజీ స్థలాన్ని కబ్జా చేసి ఆయనకు అనుకూలంగా స్థలాన్ని ఆక్రమించారని దీనిపై సంబధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గద్వాల పట్టణానికి ఈ డ్రైనేజీ పెద్దదనీ, ఈ డ్రైనేజీ వెడల్పు అధికారికంగా 30 ఫీట్లు వుంటుదని తెలిపారు. పలువురు కబ్జా దారులు ఈ డ్రైనేజీ స్థలాన్ని అందిన కాడికి దోచుకొని 30 ఫీట్ల డ్రైనేజీ నీ 6 ఫీట్లకు కుదించి నిర్మాణాలు చేశారని ఆరోపిస్తున్నారు. సంబధిత అధికారుల ద్వారా జరిగే డ్రైనేజీ ఇరుపక్కల వాల్ నిర్మాణం, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కబ్జా దారులు, కొందరు ప్రైవేట్ వ్యక్తులు కలిసి ఇష్టానుసారం కాల్వ ఇరు పక్కల వాల్ నిర్మాణం చేశారనీ, అట్టి నిర్మాణం పై చర్యలు తీసుకొని 30 ఫీట్ల డ్రైనేజీ స్థలాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. ఓ పక్క ముఖ్యమంత్రి రాబోయే భారీ వర్షాలను దృష్టిలో వుంచుకొని, హైదారాబాద్ లాంటి మహానగరాలలో ముంపు బాధల నుండి వరద బాధల నుండి ప్రజలకు విముక్తి కలిగించేందుకు హైడ్రా పేరుతో కాలువల స్థలాలను కాపాడుతున్నారు. రేపు మన గ్రేటర్ మున్సిపల్ లో కూడ వర్షాభావ విపత్తులు ఏర్పడితే డ్రైనేజి పక్క నివాస ప్రజల పరిస్థితి ఏంటి అని గొంతెత్తుతున్నారు. పలు వార్డులలో జరుగుతున్న కబ్జాల పై వివిధ పత్రికలలో వరుస కథనాలు వస్తున్నా, వివిధ ప్రజా సంఘాలు, ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఈ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుంది. ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో సంబధిత అధికారులు విఫలం అవుతున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో కొందరు వివిధ రాజకీయ పార్టీల రంగుల కండువాలు కప్పుకొని సమాజంలో బడా నాయకులుగా చెలామణి అవుతూ ప్రజా ధనాన్ని దండుకుంటున్నారని, ప్రశ్నించిన వారిపై తిరగబడి దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రహదారిలో గత పది సంవత్సరాలకు పైగా పబ్లిక్ తిరుగుతుగున్నారు. ఆ దారిపై రాకపోకలు కొనసాగేందుకు చిన్న డ్రైనేజీ మీద సీసీ స్లాబ్ వేసి సౌకర్యం -మిగతా4లో..



రహదారి మధ్యలో వున్న డ్రేనేజీ పై సీసీ స్లాబ్ వేసిన దృశ్యం



డ్రైనేజీ స్థలాన్ని కబ్జా చేసి స్థంభాలు నాటుతున్న దృశ్యం

## పోషక పదార్థాల ఆహారంతో ఆరోగ్యవంతమైన జీవితం : ఐసిడిఎస్ సూపర్‌వైజర్

**కోయిలకొండ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పోషక పదార్థాల ఆహారంతో ఆనందకరమైన ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని అంగన్వాడి ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని ఉబ్బడి తండా గ్రామ పంచాయతీలో అంగన్వాడి పోషకపక్షం అభియాన్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవితం గడపడం కోసం చిరుధాన్యాలైన పప్పులు, ఆకుకూరలు, కాయగూరలు, గుడ్లు తదితర వాటిని ఆహారంగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడిలో పోషక ఆహార పదార్థాలపై బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు ప్రతినిత్యం అవగాహన కల్పించాలన్నారు. వివిధ రకాల వంటకాలను అంగనవాడి టీచర్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు గౌడ్, మాజీ సర్పంచ్ శాంతి హరీష్ సింగ్, అంగన్వాడీ టీచర్లు సోనమ్మ, తిరుపతి బాయ్, వినోద, తులసి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకాంత్, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం వనపర్తి జిల్లాలోని 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 99 మంటలు ఆర్పే సిలిండర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి సంబంధించిన నిధులను సంబంధిత ప్రిన్సిపాళ్లకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. కళాశాలలో అనుకోని పరిస్థితులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదం నుండి తక్షణ రక్షణ పొందడానికి ఈ పరికరాలు ఉపయోగపడతాయని హైదరాబాద్‌లోని ఫైర్ సేఫ్టీ ఇంజనీర్స్ ఏజెన్సీ, వనస్థలి హిల్స్ వారు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పరికరాలను అమర్చినట్లు తెలిపారు. వారు పరికరాలను అమర్చి వాటిని ఏ విధంగా ఉపయోగించాలో కూడా డెమో నిర్వహిస్తారనీ కళాశాల ప్రిన్సిపాల్స్ ఈ పరికరాలకు సంబంధించిన పోస్టర్స్ పాంప్లెట్స్‌ను తయారుచేసి విస్తృత ప్రచారం చేస్తూ విద్యార్థులకు, స్టాఫ్‌కు అవగాహన కల్పిస్తారని అన్నారు.

## మామను చంపిన అల్లుడికి పదేళ్ల జైలు శిక్ష

**మక్తల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** పశువులకు మేత వేయమని చెప్పినందుకు సొంతమామనే అల్లుడు కట్టెతో కొట్టి చంపిన ఘటనలో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ నారాయణపేట జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ గురువారం తుది తీర్పును వెలువరించినట్లు నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మక్తల్ మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన లక్ష్మప్ప(52) తన కూతురు రేణుకను జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన గోపి మల్లేష్(30) తో 2018లో వివాహం జరిపించి ఇల్లరికం తెచ్చుకున్నాడు. అయితే 14.07. 2023న పొలం వద్ద పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో రేణుక తండ్రి లక్ష్మప్ప తన అల్లుడైన గోపి మల్లేష్‌ను పశువులకు మేత వేయాలని చెప్పగా, నాకే పని చెప్తావా అంటూ ఆగ్రహంతో ఊగిపోయిన నిందితుడు గోపి మల్లేష్ లక్ష్మప్పను కట్టెతో కొట్టగా తీవ్రగాయాల పాలై లక్ష్మప్ప మృతి చెందాడు. ఈ ఘటనపై లక్ష్మప్ప బావమరిది నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మక్తల్ పోలీసులు సాక్షాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా, నేరం నిరూపణ అయినందున నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి గురువారం తుది తీర్పును వెలువరించడం జరిగిందన్నారు. నేర నిరూపణలో విశేష కృషి చేసిన కోర్టు లైజనింగ్ ఆఫీసర్ కృష్ణయ్య గౌడ్, సిబ్బంది భీమ్‌రాజ్, కబీర్‌లను ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే వీరికి ప్రత్యేక రివార్డులను అందజేస్తామని తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అన్నాసాగర్‌లో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**భూత్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్, ఇప్పలపల్లి గ్రామాలలో గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వరికొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేసిరెడ్డి మాట్లాడుతూ రైతులు తాము ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను దళారీలకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న వరికొనుగోలు కేంద్రాలకు తరలించి తగిన గిట్టుబాటు ధరను సకాలంలో అందుకోవాలని సూచించారు. సీఎంరేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు పలు సంక్షేమపథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ చొరవతో నియోజకవర్గంలో రోడ్లు ఇతర అభివృద్ధిపనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రారంభోత్సవకార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు హరియానాయక్, మొల్గరనర్సింహులు, వడ్డె శ్రీనివాసలు, రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, తమ్మగౌడ్, దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకటేష్, కిట్టురెడ్డి, టీవీరెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

**ఆత్మకూరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఆత్మకూర్ అగ్నిమాపక శాఖ ఎస్సై శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా గురువారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రైవేట్ మాల్స్ పెట్రోల్ బంకులు పట్టణంలోని వంటగదిలో అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలని విషయంపై ప్రజలకు తగు సూచనలు జాగ్రత్తలు చేశారు. ప్రత్యేకంగా మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఎల్పిజి గ్యాస్ గోదాములో అగ్ని ప్రమాదాల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలను ప్రత్యేకించి రిహార్సల్స్ చేసి చూపించడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఎస్సై శ్రీనివాసరావు తో పాటుగా సిబ్బంది ,సంజీవరెడ్డి, భీమేశ్వర్ రెడ్డి ,నరసింహారెడ్డి ,రాముడు తదితరులతో పాటుగా పట్టణంలోని ప్రైవేట్ హాల్స్ యజమానులు పలువురు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి నెల భూ భారతి పై గ్రామ రైతు వేదికలో అవగాహన సదస్సులు పెట్టాలి

### జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన మోహన్ రావు



భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సినియర్ సిటిజన్ ఫోరం కన్వినర్ మోహన్‌రావు

**గద్వాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో నెలకు ఒకసారి రైతు వేధికలో భూ భారతి గూర్చి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సినియర్ సిటిజన్ ఫోరం జిల్లా కన్వినర్ మోహన్ రావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. భూ భారతి చట్టంలోని అంశలు రైతులకు తెలియ చేయలని పేర్కొన్నారు. తహిసిల్ దార్లను అగ్రి కల్చర్ అధికారులను భాగ స్వాములను చేయలన్నారు. గతంలో ధరణి ద్వారా సమర్పించిన పా, గిఫ్ట్ డీడ్ లకు పాసుబుక్కులు ఇవ్వలన్నారు. విఆర్ఓ ల స్థానంలో ఫీల్డ్ రెవిన్యూ అసిస్టెంట్ లను ఏర్పాటు చేయాలన్నారు. పైన పేర్కన అంశాలను జిల్లా కలెక్టరు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమఖ్య సఖ్యుడు కే. ప్రభాకర్ పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**బిజినేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించి స్థానిక సంస్థల పాలనను గాడిలో పెట్టాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు జి.అశోక్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ శ్రీరాములుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రామ పరిపాలన పూర్తిస్థాయిలో నిర్వీర్యమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ఎన్నికలు నిర్వహించి సమస్యలను పరిష్కారించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో అధికారులు నిధులు లేక మురుగు కాలువ శుభ్రత చేపట్టకపోవడంతో కాలనీలన్ని కంపుకొడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త సేకరణ, వీధిలైట్ల పునరుద్ధరణ, పారిశుధ్యం లోపంతో ప్రజలు ఆనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. వెంటనే స్థానిక ఎన్నికలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు చంద్రశేఖర్, మహమూద్, పరుశరాం, రమేష్ తదితరులు ఉన్నారు.

# భూభారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలి : ఎమ్మెల్యే



భూభారతి అవగాహన చట్టం సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** భూభారతి చట్టం 2025 పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు మేధావులు భూ సమస్యలపై అవగాహన కలిగి ఉన్న అనేకమంది సమూహంగా సూచనలు సలహాలు మేరకు ప్రభుత్వం భూభారతి చట్టం 2025 ను రూపొందించి అమలులోకి తెచ్చిందని అన్నారు. గతంలో ఉన్నటువంటి ధరణి కారణంగా రైతులకు అనేక సమస్యలు ఎదురయ్యాయని ఇప్పుడు ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంతో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చారని చెప్పారు. ఈ చట్టంలో ఉన్న నియమాలను అమలు చేయడంలో రెవెన్యూ అధికారులదే కీలక పాత్ర అని కాబట్టి వారు ఈ చట్టాన్ని అమలు చేయడంలో వారికి ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఏ విధంగా ఉంటుందో అదే విధంగా ఈ భూభారతి చట్టం ద్వారా ప్రతి ఒక్క భూమికి భూధార్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపడానికి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందిస్తుందని ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు సైతం కట్టించేందుకు వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. రాజీవ్ యువ వికాసంతో యువతకు స్వయం ఉపాధికి బాటలువేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అదేవిధంగా మహిళలను లక్షాధికారులను చేయడం మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించడం మహిళా సంఘాల ద్వారా బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీలో పెట్టించి మహిళలని వాటికి యజమానులు చేస్తుందన్నారు. విద్యార్థుల చదువు కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ ప్రభుత్వం నూతన చట్టం ద్వారా అనేక భూ సమస్యలకు పరిష్కార మార్గం చూపన ఉందని చట్టంతో పాటు రూల్స్ కూడా ఒకేసారి అమల్లోకి తెచ్చింది అన్నారు. ఈ చట్టం ద్వారా తహశీల్దార్ చేసిన ము టేషన్లు జారీచేసిన పాస్ పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డిఓకు లేదా కలెక్టర్కు అప్పీలు చేసుకునేలా వ్యవస్థను తీసుకువచ్చింది అన్నారు. ఈ చట్టం ద్వారా ఒకేరోజు రిజిస్ట్రేషన్ తో పాటు ము టేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రతి ఒక్క భూకమతానికి యూనిక్ ఐడి భూధార్ ఇవ్వడం గురించి కూడా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ,ఆర్డిఓ సుబ్రహ్మణ్యం వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఘణపురం పిఎసిఎస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి ,డివైస్ ఓ సుధీర్ రెడ్డి, తహశీల్దార్ సుగుణ పలువురు రైతులు మహిళలు యువకులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు

### పనులను వేగవంతం చేయాలి.. పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేసిన అదనపు కలెక్టర్



ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

**అలంపూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** బుధవారం మానవపాడు మండలం లోని మానవపాడు నుండి చందాపూర్ వరకు రైతులకు ఉపయోగపడే రహదారి నిర్మాణ పనులు పరిశీలించి, గ్రామీణ ప్రాంత రైతుల రవాణా సౌకర్యాల మెరుగుదలకు తోడ్పడే ఈ రోడ్ ఫార్మేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆలంపూర్ మండలంలోని ర్యాలంపాడు గ్రామంలో పశు కొట్టాల నిర్మాణం, నర్సరీ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యతను సమీక్షించిన అధికారులు వేగవంతంగా సమయపాలనతో పనులను పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించి జూన్ నాటికి నర్సరీలోని మొక్కలు కనీసం మీటర్ ఎత్తులో ఉండేలా అవసరమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అలంపూర్ లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగ్గా ఉండేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు.

**ఉపాధి హామీ కూలీలకు వంద శాతం పని దినాలు కల్పించాలి...**

లేబర్ డిమాండ్ పై ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి పనిని సమర్థవంతంగా అమలు చేయాలనీ, ఉపాధి హామీ కూలీలకు నిరంతరంగా ఉపాధి కల్పించాలనీ అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా మైక్రో ప్లాన్లు సిద్ధం చేసి, లేబర్ మోబిలైజేషన్‌కు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో 100 మంది కూలీలు హాజరు అయ్యేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. కూలీలకు వేసవి కాలం నేపథ్యంలో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతో పాటు కనీస వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు పద్మావతి, భాస్కర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఏపీఓలు రాజు పంచాయతీ భరత్ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తిక్కయ్య పాల్గొన్నారు.

# రైతులను నట్టేట ముంచిన నూజివీడు సీడ్స్

**నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలి**

**నూజివీడు సీడ్స్ యాజమాన్యంపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాచాలా బృందం

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మదనాపూర్ మండలం గోపన్ పేట గ్రామంలో నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులతో మాట్లాడి, ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ యాజమాన్యం ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా రైతులను నమ్మించి నకిలీ సీడ్స్ వ్యాపారం చేస్తుందన్నారు. అలంపూర్ నియోజకవర్గం, మారు మునగాల గ్రామానికి చెందిన లక్ష్మీకాంత రెడ్డి అనే ఏజెంట్ ఎకరానికి 40 బస్తాల దిగుబడి వస్తుందని నమ్మబలికి రైతులకు నకిలీ సీడ్స్ ఇచ్చారని, తీరా పంట చూస్తే ఎకరానికి 10 నుంచి 20 బస్తాలకు మించడం లేదన్నారు. ఆరుగాలం కష్టపడి తిండితినక, నిద్రలేక వ్యవసాయం చేస్తున్న రైతులకు నకిలీ విత్తనాలు పంపిణీ చేసి రైతులను తీవ్ర అప్పులపాలు చేసిన నూజివీడు కంపెనీపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరుకు, ఎస్పీ కి విజ్ఞప్తి చేశారు. మాకు విత్తనాలు విక్రయించిన ఏజెంట్ ఫోన్ ఎత్తడం లేదని, ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, తమకు ఎలాగైనా న్యాయం జరిగేలా చూడాలని స్థానిక రైతులు రాచాలతో మొరపెట్టుకున్నారు. వెంటనే ఏజెంటుకు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో హెడ్ ఆఫీస్‌కు ఫోన్ చేయగా అతడు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో అతడిపై రాచాల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాగుకు సరిపడా విత్తనాలు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న యాదవ్, ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, రైతులు కొండన్న, ఆంజనేయులు, వెంకటేష్, విష్ణు గౌడ్, మహామూద, వెంకటన్న, దాసరి కొండన్న తదితరులు పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం, స్పందించండి సారు..



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

**బాలానగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని పలు గ్రామాలలో, పంట పొలాలలో విద్యుత్ స్తంభాల మధ్య విద్యుత్ తీగలు వేలాడుతూ దర్శన మిస్తున్నాయి. వేలాడుతున్న విద్యుత్తు తీగల వలన పంట పొలాలలో రైతుల కు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. అలాగే గ్రామాలలో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అమ్మవారి సన్నిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

**అలంపూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అష్టదశ శక్తిపీఠాలలో ఐదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ దేవి బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అమ్మవారి స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు స్వామివారి ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల విశిష్టతల గురించి అర్చకులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో తదితరులు ఉన్నారు.

## రాంరెడ్డి మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

**భూత్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం కప్పెట గ్రామానికి చెందిన ఎస్ఈ సత్యశిలారెడ్డి తండ్రి ఎర్రగండ్ల రాంరెడ్డి గురువారం ఆకస్మికంగా మృతిచెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కప్పెట గ్రామానికి చేరుకుని రాంరెడ్డి మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి రాంరెడ్డి కుటుంబానికి తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంట సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు ఇతర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్, నరేష్‌గౌడ్ ఉన్నారు.

## కొనసాగుతోన్న పశువైద్య శిబిరాలు

**భూత్పూర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలంలో వారం రోజుల పాటు నిర్వహించే పశువైద్య శిబిరాల్లో భాగంగా గురువారం భూత్పూర్, అన్నాసాగర్, కొత్తమొల్గర గ్రామాల్లో మండల పశువైద్యశాఖ అధ్వర్యంలో శిబిరాలు కొనసాగాయి. ఆయా గ్రామాల నుంచి వచ్చిన పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్ తెలిపారు. గురువారం ఆయా శిబిరాలకు వచ్చిన 100ఆవులు, 284గేదెలు మొత్తం 384పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ మధుసూధన్ తెలిపారు. ఈ శిబిరాలలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్స్ శ్రీను, కృష్ణయ్యలతో పాటు వెటర్నరీ అసిస్టెంట్ శోభారాణి, గోపాలమిత్ర చెన్నయ్య ఇతర సిబ్బంధి పాల్గొన్నట్లు డాక్టర్ మధుసూధన్ తెలిపారు.

# డిజె సాంప్రదాయానికి స్వస్తి చెప్పండి : జిల్లాఎస్పీ రావుల గిరిధర్

**సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి**

**జిల్లాలో శుభాకార్యాలలో మతపరమైన ఊరేగింపుల్లో డీజే నిషేధం**


**జిల్లాలోని డీజే యజమానులకు అవగాహన నిర్వహించిన ఎస్పీ**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ప్రజలు డిజె సౌండ్ సిస్టమ్ సాంప్రదాయానికి స్వస్తి పలకాలని చిన్నపిల్లలు, వృద్ధులు, గుండె జబ్బు రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ శబ్దాలతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధిస్తున్నామని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశ భవనంలో జిల్లాలోని అన్ని మండలాల డీజే యజమానులు, నిర్వాహకులకు జిల్లా ఎస్పీ అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేసి నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ అధిక శబ్ద తీవ్రత గల డిజె సౌండ్ సిస్టమ్‌ను పెళ్ళిళ్ళు, శుభకార్యాలు, ర్యాలీలో ఉపయోగించడం వల్ల అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అందరికీ తెలుసనీ ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు ఈ డీజే సంపదాయానికి అలవాటు పడి తప్పతాగి విచ్చలవిడిగా చిందులు వేయడం ఒక ఫ్యాషన్‌గా మారిందని ఆయన వివరించారు. సాంప్రదాయబద్ధంగా జరగాల్సిన పెళ్ళిళ్ళు శుభకార్యాలలో కూడా డీజే సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారిందని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉండడంతో పాటు చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నట్టు పలు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అంతే కాక సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధులఆరోగ్యం దెబ్బతింటుందనే కారణంతో ఇకపై వనపర్తిజిల్లాపరిధిలో ఊరేగింపుల్లో డిజె సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్ బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ జిల్లా ఎస్పీ కీలకనిర్ణయం తీసుకున్నారు. ఈనిబంధనలు, ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘిస్తే (బిఎన్ఎస్) 223, 280, 292, 293, 324, బిఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని ఎస్పీ వెల్లడిం చారు. ఈ నిషేదిత ఉత్తర్వులను ఎవరైనా అతిక్రమిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ, కృష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సిఐ, నరేష్, ఎలక్ట్రానిక్ సౌండ్ సిస్టమ్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ప్యూరిఫైడ్ మిషన్ ఏర్పాటు



పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ మిషన్

**బిజినేపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** లట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల కోసం ప్యూరిఫైడ్ మిషన్ ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు బి.తిరుపతయ్య తెలిపారు. విర్బక్ అనిమల్ హెల్త్ వారి సహకారంతో వాటర్ ప్యూరిఫైయర్ మిషన్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులకు శుభ్రమైన మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు విర్బల్ అనిమల్ హెల్త్ సంస్థ రీజినల్ మేనేజర్ సిరాజ్ ద్దీన్, బిజినెస్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. మినరల్ వాటర్ మిషన్ ఏర్పాటు చేసిన దాతలకు పాఠశాల తరఫున సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి జ్యోతి, శ్రీదేవి సునీత వెటర్నరీ అధికారి ఇస్తారా తదితరులు పాల్గొన్నారు.

# ఈడి అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

### పెబ్బేరు పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు



బిజెపి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పెబ్బేరులో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చౌరస్తా బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేసి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యలో ఈడి కేసులు పెట్టి భయపెట్టాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. అక్రమ కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ల పేర్లు నమోదు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఇచ్చిన పిలుపుమేరకు గురువారం పెబ్బేర్ మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ప్రతిపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని కూడగట్టుకొని వెంటిలేషన్ పై సర్కారును కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వానికి త్వరలోనే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులడు వెంకటరాముల యాదవ్, మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, నాయకులు గంధం రాజశేఖర్, సురేందర్ గౌడ్, మోతే రాములు, ఎల్ల స్వామి, ధూపం సర్వేస్, బాల్చందర్, జగదీశ్వర్ రెడ్డి, యాపర్ల రామ్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, దయాకర్ రెడ్డి, షకీల్, శివ సాయి, సాయి రెడ్డి, రణధీర్ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.

# కచ్చా లే అవుట్ ప్లాట్లు రెగ్యులరైజ్ చేసుకునే విధంగా అధికారులు కృషి చేయాలి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఏప్రిల్, 30 నాటికి ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగుస్తున్నందున కచ్చా లే అవుట్, ప్లాట్‌లు రెగ్యులరైజ్ చేయించుకునే విధంగా మున్సిపల్ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుండి మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ ఎల్‌ఆర్‌ఎస్ పురోగతి పై కలెక్టర్లతో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌ఆర్‌ఎస్ గడువు ఏప్రిల్, 30 వరకు పొడిగించడం జరిగిందని అదేవిధంగా 25 శాతం రాయితీ సైతం ఇస్తున్నందున పెండింగ్‌లో ఉన్న కచ్చా లే అవుట్లు, ప్లాట్లు ఎల్‌ఆర్‌ఎస్ కట్టించి రెగ్యులరైజ్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి వివరిస్తూ వనపర్తి జిల్లాలో 48,423 దరఖాస్తులకు గాను 38,726 మందికి ఫీజు చెల్లించాల్సిన సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిరోజూ ఫోన్ చేసి సమాచారం ఇచ్చేందుకు 55 మంది మున్సిపల్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 7405 మంది తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కొరకు రూ.9.28 కోట్లు ఫీజులు చెల్లించడం జరిగిందన్నారు. 3602 ప్లాట్లకు క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వు కాపీలు సైతం జారీ చేయడం జరిగిందన్నారు. శనివారం మరోసారి డాక్యుమెంటేషన్ చేసే వారిని, లేఅవుట్ ప్లానర్లతో మున్సిపల్ కమిషనర్లు సమావేశం నిర్వహించి ఏప్రిల్ 30 గడువులోగా అత్యధిక శాతం కచ్చా లేఅవుట్లు, ప్లాట్లను క్రమ బద్ధీకరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి చట్టం

● మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం నూతనంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇది అమల్లోకి వస్తే భూ రికార్డుల ప్రక్రియ నూటికి నూరుశాతంపారదర్శకంగా జరుగుతుందని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మక్తల్ పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయంలో గురువారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికి సంబంధించిన సర్వేను పకడ్బందీగా చేపట్టి కొలతలు, హద్దులతో భూధార్ ప్రక్రియను తీసుకొస్తామని అన్నారు. భూ భారతి చట్టంను మక్తల్ మండలంలో మొదటి విడతలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని అన్నారు. ఈ చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రెవెన్యూ శాఖ అధికారులపై ఉందన్నారు. ఈ చట్టంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని కోరారు. త్వరలోనే 10954 మంది గ్రామ పాలన అధికారులను నియమించబోతున్నామని చెప్పారు.అవినీతి రహిత భూరికార్డుల నిర్వహణకే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ సతీష్ కుమార్, మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీలు కోళ్ల వెంకటేష్, వల్లంపల్లి లక్ష్మణ్, మాజీ సర్పంచులు కుర్వ హన్మంతు, గడ్డం రమేష్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడికి ఘన సన్మానం



నూతన ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుని సన్మానించిన ఎమ్మెల్యే

**పెబ్బేరు, ఏప్రిల్17 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణ ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా రంగా పురం గ్రామానికి చెందిన దేవరశెట్టి మహేష్ ఎన్నికైన సందర్భంగా రంగాపురం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడు,సంఘ సభ్యులు ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి నివాసంలో కలసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి నూతన ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు దేవరశెట్టి మహేష్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరిని కలుపుకొని పనిచేయాలని ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కోసం నా వంతు సహాయ సహకారాలుఎల్లప్పుడూ ఉంటాయని ఆయనతెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌనియుగంధర్‌రెడ్డి, పురువెంకటరమణ,సింగల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య,బిరమేష్ శెట్టి,బుచ్చయ్య శెట్టి,విజయ్ కుమార్ శెట్టి,పెద్దబాబు శెట్టి,శంకర్ శెట్టి,రాజేంద్ర ప్రసాద్‌శెట్టి, ఈపూరి శ్రీనివాస్‌శెట్టి,రంగాపురం గ్రామస్తులు కావలి బాలస్వామి, మందడి చిరంజీవి, గొల్ల బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కవన వేదిక సమన్వయకర్తకు సన్మానం

**భూత్పూర్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** జిల్లా కవన వేదిక సమన్వయ కర్త,జిల్లా ప్రముఖ కవయిత్రి బండారు సునీతను గిరిజన సంస్కృతి పరిరక్షణ విభాగం విశాఖలో మెమెంటో, శాలువలు ,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.గిరిజనుల జీవనశైలిని అధ్యయనం చేసేందుకు జిల్లా కవన వేదిక అధ్యక్షుడు రవిచంచల,సమన్వయకర్త బండారు సునీతలు వెళ్లగా వీరిని విశాఖలోని రుషికొండలోని గిరిజన సంస్కృతి పరిరక్షణ శాఖ డైరెక్టర్ ప్రొఫేసర్ నాగరాజు బండారు సునీతను ఘనంగా సన్మానించారు.ప్రముఖ కవి రవిచంచల డైరెక్టర్ ప్రొఫేసర్ నాగరాజుకు జిల్లా కవన వేదిక తరఫున పుస్తకం,డైరీ బహుకరించారు.

# సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి : కమిషనర్

**మద్దూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూర్ నూతన మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత గురువారం ఇంటి పన్నుల విషయమై లాగిన్ ఓపెన్ కావడంతో మొట్ట మొదటిసారిగా మద్దూరు మున్సిపాలిటీకి చెందిన మల్లేశం అనే వ్యక్తి ఇంటి పన్ను చెల్లించాడని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. మద్దూర్ మున్సిపాలిటీ ప్రజలు వారి ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలను ఆయన కోరారు.

# మరణించిన మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన తోటి మిత్రులు



**ఖిల్లాఘణపురం, ఏప్రిల్17 ప్రభాతవార్త:** తోటి మిత్రుడు మరణించడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న తోటి మిత్రులు లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందజేశారు. తోటి మిత్రుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన శీర్లాల రాజేందర్ ఈనెల 8వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కూతురు ఉన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదు అని తెలుసుకున్న 1986-87 ,10వ తరగతి వరకు కలిసి చదువుకున్న బ్యాచ్‌కు సంబంధించిన వారందరూ కలిసి తలా ఇంత డబ్బు ప్రోగు చేసి 1,22,500 వరకు కూడా పెట్టారు. లక్ష రూపాయలు స్థానిక మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో కూతురు చెన్నై పేరిట ఫిక్స్ డిపాజిట్ చేసి దానికి సంబంధించిన బాండును గురువారం మృతుడి ఇంటికి వెళ్లి భార్య లక్ష్మి కూతురు చిన్మయిని పరామర్శించి వారికి అందజేశారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అన్ని రకాలుగా ఆదుకుంటామన్నారు. తోటి మిత్రులు అందజేసిన ఈ సహాయాన్ని గ్రామస్తులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవ శ్రీనివాసులు, సత్య శీలా రెడ్డి శాఖ నరేందర్ బాబు, నటరాజుశర్మ, ఆంజనేయులు, దేగ కృష్ణయ్య అడ్వకేట్, ఆంజనేయులు పాల్గొన్నారు.

# క్రీడ మైదానాలు ఆధునిక దేవాలయాలు

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.కూచుకుల్ల రాజేష్‌రెడ్డి



ఎమ్మెల్యే చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకుంటున్న పాలెం క్రీడాకారులు

**బిజినేపల్లి, ఏప్రిల్17 ప్రభాతవార్త:** క్రీడలు, దేవాలయాలు రెండూ మానవ మనస్సుపై ఒక ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రజల జీవితంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే డా.కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. వాంటెడ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నీ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి పెట్టడానికి క్రీడ మైదానాలు ఆధునిక దేవాలయాలుగా పని చేస్తాయన్నారు. క్రీడా పోటీల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల యువకులతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడల వల్ల యువత మధ్య ఐక్యత పెరిగి, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా జిల్లా కేంద్రంలో ఇండోర్ ఔట్‌డోర్ క్రీడలను నిర్వహించేందుకు పది ఎకరాల్లో 15 కోట్ల రూపాయలతో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసే దిశగా ఆలోచన చేస్తున్నామన్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించి స్థల సేకరణ అనంతరం పనులు ప్రారంభిస్తామని చెప్పడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానంగా యువత డ్రగ్స్ గంజాయి మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ క్రికెట్ పోటీల్లో పాలెం జయకృష్ణ జట్టు మొదటి బహుమతి, బిజినేపల్లి జట్టు రెండవ బహుమతి సాధించాయి.గెలుపొందిన టీమ్‌లకు కప్పుతో పాటు ప్రైజ్‌మనీ అందించి అభినందించారు. క్రికెట్ నిర్వాహకులు జయకృష్ణ,ముద్దం వెంకటేష్‌రెడ్డి, గంగనమోని సంపత్, భీమని ప్రశాంత్‌లను ఎమ్మెల్యేఅభినందించారు. కార్యక్రమంలో మలిశెట్టి వెంకటస్వామి, మిద్దె రాములు, గోవిందు, రామకృష్ణ, బంగారి పర్వతాలు,ఎద్దుల శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, కత్తెఈశ్వర్ వాల్యా నాయక్,బాలరాజ్, రామచందర్, తిరుపతయ్య, చిక్కంద్ర రాములు, పరశురాములు, బాలపీర్, పాషా సైదులు, సంపత్ అభిలాష్,నరేష్,అజయ్,దేవేందర్, కార్తీక్,అమాన్ పాల్గొన్నారు.

# మహిళల చైతన్యంతోనే మార్పు సాధ్యం

**సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి : సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మహిళల చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డిఇందిర అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సామాజిక అంశాలపైఅవగాహన కలిగి ఉండాలని ఆమె తెలిపారు. మన చుట్టుపక్కల జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దాడి ఘటనలను చూసినా, విన్నా వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.ఇలాంటి ఘటనలు జరుగుతున్న సమాచారాన్ని గోప్యంగా ఉంచడం ఆ నేరానికి మనము కూడా సహకరించినట్లేనని ఆమెతెలిపారు.మహిళా సంఘాలలోని సభ్యులు బాల్య వివాహాలు,బాల కార్మికుల అంశాలపై అవగాహన ఉండాలని ఆమె సూచించారు. గ్రామాలలో ఎక్కడో ఒకచోట బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయని వాటి సమాచారాన్ని మహిళా సంఘాల సభ్యులు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి మహిళా సభ్యురాలు సహకారం అందించాలన్నారు. నిరుపేదలైన మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తామని ఆమె తెలిపారు.జిల్లాలోని మండలం పోక్సో కేసుల్లో ముందుందని ఆమె గుర్తు చేశారు. ప్రతి మహిళ న్యాయ,చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు స్థానిక ఎస్సై రామ్‌లాల్ నాయక్ మాట్లాడుతూ మన చుట్టూ నిత్యం మైనర్లు, మహిళలపై జరిగే లైంగిక దాడుల సమాచారాన్ని స్థానిక పోలీసులకుఅందించాలని అప్పుడే నేరాలను కట్టడి చేయవచ్చన్నారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సీనియర్ సివిల్ జడ్జి సందర్శించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి చదువులో రాణించాలని, మంచి మార్గాన్ని ఎంచుకొని ముందుకు సాగాలనిఆమెసూచించారు.పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాలలో తహసిల్దార్ ఎల్లన్న, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి,ఏపిఎం విష్ణుచారి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పద్మ, పర్సనల్ వాలంటీర్ యాదయ్య పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా సీడ్ ప్రాసెసింగ్ జరిగితే చర్యలు

● వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు యశ్వంత్‌రావు ● భూత్పూర్ మండలంలోని సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీ చేసిన అధికారులు



ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీ నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు


**భూత్పూర్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విత్తన శుద్ధి (సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ల)కేంద్రాలలో ప్రాసెసింగ్ జరిగితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు యశ్వంత్‌రావు అన్నారు.జిల్లా ఎస్పీ జానకి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా,నియోజకవర్గ వ్యవసాయాధికారుల బృందం గురువారం భూత్పూర్ మండలంలోని పలు సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడీ యశ్వంత్‌రావు మాట్లాడుతూ సీడ్ యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ఎలాంటి అలసత్వం వహించరాదని స్పష్టం చేశారు.విత్తన శుద్ధి,ప్యాకింగ్, గోదాముల నిర్వహణ వంటి అంశాలపై బృందం సభ్యులు పర్యవేక్షించారు.భూత్పూర్ మండలంలోని పోతులమడుగులో ఉన్న మా అగ్రి బయోటెక్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్,సాయి తేజ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్,భూత్పూర్‌లోని సికోసిప్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్,సుదివ్య సీడ్ ప్రాసెసింగ్ యూనిట్,జడ్చర్ల రోడ్‌లో ఉన్నఆద్య సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెలను తనిఖీ నిర్వహించారు.ఈబృందంలో జిల్లాస్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రత్నం, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారి మురళిధర్ ఉన్నారు.

# రైతులకు అందుబాటులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు



**గండీడ్, ఏప్రిల్17 ప్రభాతవార్త :** రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే వరి ధాన్యం పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుల దగ్గరకే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏ. జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రుసుంపల్లి, చిన్న వార్వల్, జిన్నారం, జక్కులపల్లి, రంగారెడ్డి పల్లి, మనసూర్ పల్లి, పగిడియాల్ తదితర గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలోఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందన్నారు. పరిగి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు అనంత లక్ష్మారెడ్డి, కాజప్ప, మాజీఎంపిటిసివెంకట్రాంరెడ్డి, ఏపిఎం బాలకృష్ణ, శివలీల, సమత, గౌతమి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆశిరెడ్డి, రవీందర్‌రెడ్డి,శంకరయ్య,ఆంజనేయులుగౌడ్,తిమ్మారెడ్డి, తిరుపతయ్య,మోహన్‌రెడ్డి,దస్తయ్య, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్లో తూనికల కొలతల అధికారుల తనిఖీ



**ధన్వాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో గురువారం కూరగాయల మార్కెట్లో తూనికల కొలతల జిల్లా అధికారి డి.సత్యనారాయణ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా అధికారి డి.సత్యనారాయణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ కాంటా ఒక సంవత్సరానికి ఒకసారి బాటిళ్ల కాంటలు రెండు సంవత్సరాలకు ఒకసారి తనిఖీ ఉంటుందని కాంట, బాటిళ్లను సరి చూసి ముద్రలు వేస్తామని ఆయన అన్నారు. అదేవిధంగా మార్కెట్లోని వ్యాపారస్తులు మాకు ఏమి ఇన్ఫర్మేషన్ ఇవ్వకుండా సడన్‌గా వచ్చి డబ్బులు ఇవ్వండి అంటే ఎట్లా అని అంటున్నారు. అదే ఒకవేళ మాకు ముందే చాటింపు వేసి అడుగుతే మేము కడతామని వ్యాపారస్తులు అంటున్నారు.

# ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల ఏకరూప దుస్తుల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు ఏకరూప దుస్తులను అందజేస్తున్న ఎంఈఓలు

**ఇటిక్యాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 24వ తేదీ నుండి వేసవి సెలవులను జూన్ 12వ తేదీ వరకు ఇస్తుండగా పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేనాటికి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఏకరూప దుస్తులు సిద్ధం చేసేందుకు గాను గురువారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఏకరూప దుస్తులను ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల విద్యాశాఖ అధికారులు అమీర్ పాష, వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. వేసవి సెలవులలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను గ్రామ మహిళా సంఘాలద్వారా తరగతుల వారిగా కుట్టించేందుకుగాను ముందుగా ఒక జత చొప్పున ఏకరూప దుస్తుల పంపిణీని చేపట్టారు. డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో గ్రామ మహిళా సమాఖ్య ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి పాఠశాలలు ప్రారంభం తర్వాత విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో 2 మండలాలపాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఏపిఎం కురుమన్న, ఎంఆర్సి కోఆర్డినేటర్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలి

**జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు**

**ఇటిక్యాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** 3 నెలలు పైబడిన అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కొండేరు ఇటిక్యాల గ్రామాలలో కొనసాగుతుండగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు, కొండేరు ఇటిక్యాల గ్రామాలలో పర్యటించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించి స్వయంగా పశువులకు టీకాలను వేశారు. ఇందులో 80 తెల్ల పశువులు, 186 గేదెలకు గాలికుంటూ నివారణ టీకాలు వేసినట్లు డా. భువనేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య డాక్టర్లు భువనేశ్వరి, వినయ్ కుమార్, సిబ్బంది హనుమన్న, రామకృష్ణ, గోపాల మిత్రలు విజయ్ భాస్కర్, రాజేంద్ర సింహ, భారతిష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

19న ఎర్రవల్లి, 22న ఇటిక్యాలలో

# భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు

**ఇటిక్యాల, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణిస్థానంలో కొత్తగా తెచ్చిన భూముల ఆర్‌ఓఆర్ హక్కుల రికార్డు చట్టంపై అందులో ఉన్న అంశాలను తెలుసుకునేందుకు ఈనెల 19వ తేదీ ఎర్రవల్లిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సు ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ హాజరుకానున్నట్లు ఎర్రవల్లి తహసిల్దార్ నరేష్ తెలిపారు. భూభారతి చట్టంపై తెలుసుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆయన కోరారు. అదేవిధంగా ఈనెల 22వ తేదీఇటిక్యాల మండలకేంద్రంలో కొత్తగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లాకలెక్టర్ బి.యం.సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చట్టంపై పూర్తిగా అవగాహన పెంచుకునేందుకు రైతులు హాజరుకావాలని ఇటిక్యాల తహసిల్దార్ వీరభద్రప్ప తెలిపారు.

# పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుంది

◆ నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్17 ప్రభాతవార్త:** పదోన్నతి ఉత్సవంతో పాటు మరింత బాధ్యతలు పెంచుతుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. డి. శివరెడ్డి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది గురువారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్పీ ప్రధాన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఎస్పీ ప్రమోషన్ పొందిన శివరెడ్డికి హెడ్ కానిస్టేబుల్ పట్టీలను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూఉద్యోగ జీవితంలో పదోన్నతి ఎంతో ఉత్సాహాన్నిస్తుందని, దాంతోపాటు బాధ్యతను కూడా పెంచుతుందని తెలిపారు. విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు.

# గ్రామస్తులకు ఆపన్నహస్తంగా నిలుస్తున్న జెకె ట్రస్ట్

**నవాబుపేట, ఏప్రిల్17ప్రభాతవార్త:** నవాబుపేట గ్రామ వాసులకు ఆపన్నహస్తంగా నిలుస్తూ ప్రతి పేదవాడికి తనవంతు సహాయంగా మేమున్నామంటూ జెకె ట్రస్ట్ యాజమాన్యం గ్రామ ప్రజలకు భరోసానిస్తుంది. నవాబుపేట మండల కేంద్రంలోని జెకె ట్రస్టు ఆధ్వర్యంలో పుట్టిలాలు తల్లిపుట్టి కిష్టమ్మ అకస్మాత్తుగా మరణించడంతో విషయం తెలుసుకున్న జెకె ట్రస్ట్ యాజమాన్యం లాలు కుటుంబానికి తమవంతు సహాయంగా అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు. కుటుంబ సభ్యులు జెకె టెస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెకె ట్రస్ట్ యాజమాన్యం, జెకె ట్రస్ట్ కార్యకర్తలు ఉన్నారు.

# రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని మంత్రికి వినతి

**మద్దూర్, ఏప్రిల్17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని ఖాజీపూర్ గ్రామానికి భూ భారతి ప్రారంబానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సీపీఎం మండల బృందం ఇటీవలి కాలంలో వడగళ్ళవాన నందిపాడ్, పల్లెర్ల, లక్కాయపల్లి తదితర గ్రామాల్లో అకాల వర్షం వాడగాళ్ళు పడి చేతికి వచ్చిన వరి పంట పూర్తిగా నష్ట పోయి రైతులకు అపార నష్టం కలిగింది. అలాగే భూగర్బ జలాలు ఇంకి పోయి వేసిన పంటలు ఎండిపోయి రైతులు పెట్టిన పెట్టుబడి కూడ చేతి రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మొహ్మద్ అలీ, డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు భరత్ కుమార్, భీమప్ప, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి క్రీడా శిబిరాలు : డివైఎస్‌ఓ

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** మే 1 నుండి 31 వరకు నారాయణపేట మిని స్టేడియంలో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డివైఎస్‌ఓ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో ఉచిత శిక్షణ ఇస్తూ జిల్లా యువతను క్రీడాకారులను జాతీయస్థాయిలో సీనియర్‌క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. క్రీడా శిబిరాలలో వివిధ క్రీడాంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు సీనియర్ క్రీడాకారులైతే వారి స్పోర్ట్స్ సర్టిఫికెట్‌తో ఈనెల 22లోగా జిల్లా క్రీడా శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారి అర్హతను బట్టి కోచ్‌లుగా ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వేసవి శిబిరాలు నిర్వహిస్తారని దాదాపు పది శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తారని కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, కోకో, నెట్‌బాల్ తదితర అంశాలలో కోచ్‌ల ప్రవేశ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

**శ్రీరంగాపూర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన బాలు తండ్రి బాలస్వామి అనే వ్యక్తి సుగురు గ్రామానికి చెందిన జ్యోతి అనే వివాహితతో గత నెల వెళ్లిపోయి తిరిగి రాలేదనే ఫిర్యాదు పైన మిస్సింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

# తోటి మిత్రునికి ఆర్థిక సాయం చేసిన క్లాస్మేట్స్

**పెబ్బేర్ ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన గులాం అనే వ్యక్తి తన ఆరోగ్యం, ఇంటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి సతమతమవుతున్న గులాం పెబ్బేర్ లో పుట కోసం బిక్షాటన చేయడానికి సిద్ధమై పెబ్బేరు పట్టణంలో తిరుగుతూ ఉండగా తన చిన్ననాటి మిత్రులు చూసి పదవ తరగతి 2002-2003 సంవత్సరం బ్యాచ్ మిత్రులందూ కలిసి గులాం కుటుంబానికి 40,000 ఆర్థిక సహాయం అందజేశారు.

# ఫారెస్టు అధికారులకు గ్రామస్తుల వినతి

**నవాబుపేట, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** ఎన్మనగండ్ల దేవర గుట్టలో పులుల కలకలంతో అడవి అధికారులు అప్రమత్తమై గురు వారం ఎనుమనుగండ్ల దేవరగుట్టను చేరుకున్నారు. గ్రామ యువ నాయకులు చుట్టుపక్కల రైతులు అధికారులకు పులుల సంచారంతో భయాందోళనకు గురవుతున్నామని పంట చేళ్లకు వెళ్లడానికి భయంగాఉందని వెంటనే పులులనుపట్టుకొని గ్రామస్తులను కాపాడాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. అటవీ అధికారులు డీఎఫ్‌ఓ సత్యనారాయణ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రయ్య, సెక్షన్ ఆఫీసర్ వెంకటేష్ బీట్ ఆఫీసర్ రమేష్, దేవరగుట్టను చేరుకొని గుట్ట చుట్టుముట్టు పరిశీలించి ఏ టైం కు బయటికెళ్తున్నాయి ఏ టైంకు వస్తున్నాయి అని గుర్తించి సిసి కెమెరాలు ఏర్పాటు చేసి రెండు మూడు రోజులలో పులులనుబంధించే బోను ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొనింటి బాలయ్య, చెలిమి ఆంజనేయులు, రామస్వామి, కొనింటి నాగరాజు, వేణు, హనుమంతు నాయక్, నాగరాజు, కొనింటి చెన్నయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



## భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

వివరించారు. ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలున్నాయని తెలిపారు. గతంలో ధరణిలో మన జిల్లా టాప్ 10 స్థానంలో ఉందాని తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడినదని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పని చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకుఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. మే 1వతేదీ నుంచి గ్రామ పాలన అధికారుల నియామకంతో భూ సమస్యలు సులభతరం అవుతుందని తెలిపారు. గ్రామాల్లో మండల వ్యవసాయాధికారుల సహకారంతో రైతు వేదికల వద్ద ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని, భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డీఓ శ్రీనివాస రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, పి.ఎ.సి.ఎస్ చైర్మన్ సుభాన్ గద్వాల్ తహశీల్దార్ మల్లికార్జున్, జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్ పులులు

మొదటి పేజీ తరువాయి భాగం..

ఆకలిని తీర్చుకుంటున్నాయి. ఇప్పటివరకు దాదాపు ఆ చిరుతలు 11 శునకాలను హతమార్చి వాటి మాంసా న్ని తిన్నాయి. దేవర గుట్టకు చేరిన తర్వాత రెండు,మూడు రోజులు గుట్టపై గల గుహలలోనే గడిపిన చిరుతలు ఆకలితో ఉండి పొద్దస్థమానం గుట్టలోని గుహలలో గడిపిన అవి రాత్రివేళ జనసంచారం లేని సమయంలో గుట్ట దిగివచ్చి ఆకలి తీర్చుకోవడానికి జంతువుల వేట ప్రారంభించాయి. చిరుతల ఆవాసం గురించి ముందే పసిగట్టిన పశువులను కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండడంతో తమకు సమీపంలో అగుపించిన శునకాలను చాకచక్యంగా నోట కరుచుకుని గుట్టపైకి చిరుతలు ఈడ్చుకుంటూ వెళ్లి అక్కడ వాటిని భుజించి తిరిగి గుహలలోనే అవి సేదతీరుతున్న ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కుక్కల రక్తపు రుచి మరిగిన చిరుతలు ఎప్పుడైనా గ్రామంలోకి చొరబడి గ్రామ సింహాలపై దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని చుట్టుపక్కల గ్రామాల,గిరిజన తాండాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చిరుతలను పట్టి బంధించి వాటిని ఇక్కడి నుండి తరలించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించకూడదని, సాధ్యమైనంత త్వరగా వాటిని పట్టి బంధించి తీసుకెళ్లి తమకు, తమ పశువులకు, తమ శునకాలకు ప్రాణ రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు. గుట్ట చుట్టు ప్రక్కల తమ వ్యవసాయ పొలాలు ఉన్నందున పంటల సాగు కోసం నీరు పారించేందుకు, పశువులను మేపేందుకు, వాటికి నీరు త్రాగించేందుకు అక్కడికి తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో గుట్టపై చిరుతల ఆవాసం తమను ఎంతగానో కలవరపరుస్తుందని, అటువైపు వెళ్లేందుకు సాహసం చేయలేకపోతున్నామని, దానివల్ల పంటలకు సాగునీరు పారించేందుకు, పశువులను మేపేందుకు వీలుకావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం చిరుతలు గుట్ట రాళ్ల మధ్య సంచరిస్తూ కనిపించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అక్కడికి వెళ్లి వాటిని తమ సెల్ ఫోన్ కెమెరాలతో ఫోటోలు, వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపులలో షేర్ చేశారు.

## ఆగని కబ్జాలు... అడిగే వారే లేరా?

మొదటి పేజీ తరువాయి భాగం..



30 ఫీట్ల డ్రైనేజీని 6 ఫీట్లకు కుదించి సైడ్ వాల్స్ నిర్మాణం చేసిన దృశ్యం

కల్పించారు. ఇప్పుడు ఆ దారికి అడ్డంగా స్తంభాలు పాతి, డ్రైనేజీ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొనీ, డ్రైనేజీ స్థలాన్ని, ఎన్నో ఏళ్లుగా నడుస్తున్న రహదారినీ కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**కమిషనర్ వివరణ :** పట్టణంలో కబ్జాల పరంపరా కొనసాగుతూనే వుంది. ఈ కథనంపై మున్సిపల్ కమీషనర్ ను వివరణ అడిగేందుకు వెళ్ళగా ఆఫీసులో అందుబాటులో లేరు. ఫోన్ కాల్ చేయగా స్పందించడం లేదు.

## నేనూ భూ భారతిలో దరఖాస్తు చేసుకుంటా..

మొదటి పేజీ తరువాయి భాగం..

వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు.భూ భారతి చట్టం రూపకల్పనలో ప్రముఖ పాత్ర పోషించిన న్యాయవాది భూమి సునీల్ మాట్లాడుతూ పది కాలాల పాటు నిలిచే చట్టం భూ భారతి అని పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్ళినా భూ సమస్యలు ఉన్నాయని, రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులు ఏదో సమస్య ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూ భారతి చట్టంలో భూమి రికార్డ్‌లో లేకున్నా, తప్పులు ఉన్నా, సెక్షన్4, సబ్ సెక్షన్ 5,6 కింద దరఖాస్తు పెట్టుకొంటే సమస్య పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. జూన్ 2 నుండి ఆగస్టు 17 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామాలకు వస్తారని తెలిపారు. గ్రామంలో నిర్ణీత రెండు పేజీల దరఖాస్తు పెట్టుకొంటే సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. 3,4 నెలల్లో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానున్నట్లు తెలిపారు.6 వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్‌లను నియమించి మ్యాప్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసి రాబోవు రోజుల్లో పట్టాదారు పాస్ పుస్తకంలో కూడా మ్యాప్ పొందుపరచడం జరుగుతుందని అన్నారు. దేశంలో ఏ చట్టంలో లేని విధంగా భూ భారతి చట్టంలో నియమాలు ఉన్నవని ఆయన తెలిపారు. 30 లక్షల మంది రైతులకు ఈ చట్టం ద్వారా మేలు జరుగుతుందని అన్నారు. సమావేశంలో ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా భూ భారతి చట్టంను ప్రదర్శించి అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జడ్పీ సిఈఓ వెంకటరెడ్డి,ఆర్డీఓ నవీన్, తహశీల్దార్ నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ అనేది సహజం

■ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి రాణి



మాట్లాడుతున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణి

**లింగాల, ఏప్రిల్17 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడ పని చేసిన బదిలీ అనేది తప్పనిసరిగా ఉంటుందని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి రాణి అన్నారు. గురువారం మండల పరిధిలోని అవుసలికుంట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు జులేఖ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో రకాలైన సదుపాయాలను కల్పిస్తుందని వాటిని ఉపయోగించుకొని విద్యార్థులు ఎదగాలని సూచించారు. వీడ్కోలు పొందుతున్న ఉపాధ్యాయురాలు జులేఖ మాట్లాడుతూ ఇక్కడ మూడు సంవత్సరాలుగా విద్యార్థులకునాణ్యమైన విద్యను అందించి, పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కూడా తనకు సహకారం అందించి తగు సలహాలు సూచనలు చేసినట్లు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గార్లపాటి పాండు, ఉపాధ్యాయులు హరికృష్ణ, రేష్మ బేగం, కల్పన, పంచాయతీ కార్యదర్శి ఎన్. చంద్రయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాన రోడ్డుపై రంధ్రం

**ధన్వాడ, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో బిజ్వర్ పాతపల్లి కొత్తపల్లి నుంచి ధన్వాడకు నిత్యం వాహనాలపై ప్రజలు వస్తుంటారు. కురువగేరి దగ్గర డ్రైనేజీ పైప్ లైన్ రంధ్రం పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ రంధ్రం పడి దాదాపు 6 నెలలు అవుతుంది ఎవరు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడైనా పంచాయతీ సెక్రెటరీ స్పందించి బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై రంధ్రం ఏర్పడిన దృశ్యం

## అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

■ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

■ రైతులకు తుంపర సేద్యం పరికరాలు అందజేత



రాయితీపై మంజూరైన తుంపర సేద్యం పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 80మంది రైతులకు గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి రాయితీపై మంజూరైన తుంపర సేద్యం పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రైతుకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు గాని విత్తనాలు గాని పంపుసెట్లు గాని తుంపర సేద్యం పరికరాలు గాని బిందు సేద్యం పరికరాలు గాని అందివ్వలేదని నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మళ్లీ అన్నదాతలకు అందించే రాయితీ వ్యవసాయ ఉపకరణాలను అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇన్చార్జ్ సత్యశీలారెడ్డి, శివన్న, సురేందర్ గౌడ్, సురేష్‌గౌడ్, ఉద్యానవన శాఖ అధికారులు విజయభాస్కర్ హెచ్ఈవోలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




కరాటేలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**కరాటే విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే:** గోపాల్‌పేట మండలం కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలను చూసిన వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి విద్యార్థులను అభినందించారు. గురువారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విద్యార్థినుల కరాటే ప్రదర్శన కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులు ప్రదర్శించిన, కర్ర సాము, చేతులపై నుంచి కారును తోలటం, పొట్టపై నుంచి మోటార్ సైకిల్‌ను తోలడం, లాంటి తదితర విన్యాసాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే విద్య నేర్చుకోవడం వలన ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని దాని వలన దేన్నైనా సాధించగలమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నత చదువులతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని ఇలాంటి క్రీడలను ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని ఆయన సూచించారు. క్రీడాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, క్రీడల తర్ఫీదు కోసం అధునాతన శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులను ఆయా క్రీడలలో తర్ఫీదునిచ్చి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సైతం పంపేందుకు పూర్తిస్థాయిలో ప్రభుత్వమే సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ముగింపు దశకు బ్రహ్మోత్సవాలు

**కృష్ణ, ఏప్రిల్17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడేబల్లూరు పుణ్యక్షేత్రంలో వెలసిన స్వయంభువుడిగా శ్రీ వెంకటేశ్వర స్వామి పూజలందుకుంటున్నాడు.వేలాది భక్తాదులకు కోరిన కోర్కెలు తీర్చేటి మహా పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది.ఆ శ్రీనివాసుడి చరిత్ర పూర్వము మాండవ్య మహర్షి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి శ్రావణమాస బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని వెళుతుండగా మార్గం మధ్యలో పవిత్రమైన కృష్ణానది నిండుకుండలా ప్రవహిస్తుండడంతో ఋషులకు దానిని దాటడం వీలు కాలేదు. అయినప్పటికీ తన తపఃశక్తితో నదినిదాటగలడు, కానీ తన తపశక్తిని వృధా చేసుకోవద్దని తలచి సుమారు మూడు కిలోమీటర్లు వెనక్కి తిరుగు ప్రయాణమయ్యారు. ఆ అరణ్యం పేరు గుండిలారణ్యం. ఆ అరణ్యంలోని కొండ గుహలో శ్రీవారి దర్శనం కోసం ఘోర తపస్సుకు కూర్చున్నారు.అలా తపస్సు చేస్తుండగా గుండిలాపురం (గుడేబల్లూరు గ్రామం)కి చెందిన ఒకఆవు ఆహారం నిమిత్తం అరణ్యంలోకి వెళ్లి ఋషి వర్యులకు నోటిలో పాలు విడుస్తూ ఉండేది. ఆ గో యజమాని గొల్ల వారికి రోజూ పాలు ఇచ్చేది కాదట, అయితే గోవు పాలు ఎక్కడికి పోతున్నాయని ఆలోచనలో పడ్డారు. ఒకరోజు అనుమానం వచ్చి గోవును అనుకరించడం మొదలుపెట్టారు. ఆ గోవు ఋషికి ఆకలి వేసే సమయానికి గుహలోకి వెళ్ళింది. అది గమనించిన యాదవుడు గుహలోకి వెళ్ళాడు. అక్కడ గోవు ఋషికి పాలు విడవడం చూసి నివ్వెరపోయి అక్కడ నుండి పరుగు పరుగున ఇంటికి వెళ్లి పెద్దవాళ్లకు విషయాన్ని వివరించాడు. అనంతరం గోపాలురు వచ్చి ఋషివర్యులకు నమస్కరించారు. అయితే నేను ఈ గోవును చూశాను కనుక ఈ గోవు పాలు ఇవ్వాలి కనుక ఇక్కడ ఉన్నంతకాలం మీరే నాకు సేవలు చేయాలని ఆదేశించారు. అలా ఋషివర్యులు శ్రావణమాసం నుండి చైత్ర పౌర్ణమి వరకు తపస్సు చేయగా, శ్రీవారు భూదేవి సమేతంగా ప్రత్యక్షమై చైత్ర పౌర్ణమి రోజు దర్శనం ఇచ్చారు. అప్పుడు స్వామి వారు ఋషికి మీ మాండవ్య తపస్సును మెచ్చితిని మీకు ఏమి కావాలో కోరుకో అన్నాడు. మాండవ్య మునివర్యులు మాకు ఏమీ వద్దు మీ దర్శన భాగ్యంతో నా జన్మ ధన్యమైందన్నారు. అప్పుడు మునివర్యులు మాట్లాడుతూ.. స్వామి మీరు ఇక్కడే కొలువుదీరితే అప్పుడు ప్రజలం దరికీ పూజలతో సేవ చేసే భాగ్యం కలుగుతుందని వేడుకున్నాడు. నాకు చేసిన ఆ అర్చకులు మీకు నిత్యముగా అర్చకులుగా కొలుస్తా రని అన్నారు. అప్పుడు స్వామి అక్కడే ఉన్న బండరాయి మీద సతీసమేతంగా శ్రీస్వయంభు వెంకటేశ్వర స్వామిగా వెలిశారు. తిరు మల తిరుపతి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే ప్రతి పూజలు ఇక్కడ 9రోజులు జరుగుతాయని ఆ మహర్షికిస్వామివారు ఆజ్ఞాపించారని పురాణాలలో చెప్పబడింది. కాబట్టి ఆనాటి నుండి గుడేబల్లూరులో వెలసిన శ్రీస్వయంభు లక్ష్మీవెంకటేశ్వర స్వామి వారికి ఇక్కడి ప్రజలు పూజలు చేస్తూ వస్తున్నారు. ప్రతి సంవత్సరం జరిగే స్వామివారి బ్రహ్మోత్స వాలు ఈనెల 11 శుక్రవారం నుండి ప్రారంభమైన 19 వరకు తొమిది రోజులపాటు నిర్వహిస్తారు. 19న స్వామి వారికి ఉయ్యాల సేవ,అనంతరంఅర్చకుల గృహం నందు స్వామివారి కల్యాణ మహోత్సవం. నిత్యం 11 నుంచి 19 వరకు భజనమండలి వారిచే అఖండభజన సంకీర్తన కార్యక్రమాలు నిర్వహి స్తారు. ఈబ్రహ్మోత్సవాలకుతెలంగాణతోపాటు సరిహద్దు ప్రాంతాలైన ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర భక్తాదులు వేలాదిగా పాల్గొన్నారు.




హోరాహోరీగా సందెపురాళ్ల పోటీలు, పాలవుట్ల కార్యక్రమం



అంగరంగ వైభవంగా స్వామివారి మహారథోత్సవం

## మే 20న సమ్మె జయప్రదం చేయండి: సీఐటీయూ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** గురువారం రోజు కార్మిక సంఘాల జేఏసీ సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ మే 20దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయడానికి ఏప్రిల్ 22న మంగళవారం రోజు ఉదయం 10 గం.లకు సిఐటియు జిల్లా కార్యాలయంలో సన్నాహక సదస్సు నిర్వహించబోతున్నామని ఈ సదస్సులో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, టిఎన్‌టి యుసి, బిఆర్‌టియు ,హెచ్ఎంఎస్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొనబోతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, అధిక ధరలు తగ్గించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ బోనస్ గ్రాట్యుటీ, పెన్షన్స్ సౌకర్యాలు కల్పించాలని, ప్రవేటీకరణ, కాంట్రాక్టీకరణ,ఔట్‌సోర్సింగ్ విధానాల రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటుధర కల్పించాలని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టాన్ని ప్రకటబందిగా అమలు పరచాలని తదితర డిమాండ్లతో జరిగే సమ్మె జయప్రదానికై ఈ సదస్సు జరగబోతుందని సదస్సులో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, టియుసిఐ జిల్లా నాయకులు వెంకటేష్, టిఎన్టియుసి నాయకులు దనువాడ రాములు,బిఆర్‌టియు నాయకులు కృష్ణ మోహన్ తదితరులు పాల్గొంటున్నారని గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం వెంకటేష్ గౌడ్, బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాళ్ల అనురాధ, జిల్లా నాయకురాలు పద్మ, ఆంజనేయులు, హమాలి సంఘం నాయకులు నారాయణ, రామాంజనేయులు, నరసింహులు తదితరులుపాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి

## రెడ్డి, బీసీ వర్గాల మధ్య ఎలాంటి తారతమ్యాలు లేవు

◆ ఇకపై ఆకాశరామన్న వార్తలు మానుకోవాలి : మాజీ జడ్పిటీసీ లక్ష్మారెడ్డి

◆ అన్ని వర్గాలు కలిసికట్టుగానే ఉన్నాం.. కలిసికట్టుగానే కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తాం: ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోళ్ల వెంకటేష్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**మక్తల్ టౌన్, ఏప్రిల్17 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి నివాసంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రెడ్డిలు, ముదిరాజుల మధ్య ఎలాంటి తారతమ్యాలు లేవుని అన్ని వర్గాల వారు సమానంగా పార్టీలో ఉన్నామని ఆకాశరామన్న వార్తలు ఇకపై మానుకోవాలని మీరు ఎన్ని కుతంత్రాలు పన్నినా మా మధ్య బంధాన్ని విడదీయలేరని ఇలాంటి కుయుక్తులకు పాటుపడిన వారికి త్వరలో తగిన శాస్తి చెప్తాం, ముదిరాజులు, రెడ్డిలు అన్నీ కులాల బిసి,ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీల సహకారంతోనే స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని గెలిపించుకున్నామని రాబోయే కాలంలో వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడం ఇష్టం లేక కొందరు వ్యక్తులు కుయుక్తులకు పాల్పడి మావద్ద వైరాగ్యాన్ని పెంచే విధంగా ఆకాశరామన్న వార్తలు రాసి మధ్య పెట్టడం సరికాదని అన్నారు. రెడ్డిలంతా కలిసే వాకిటి శ్రీహరి గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డామన్నారు. దీన్ని చూసి ఓర్వలేక ఇట్లాంటి మాటలు మాట్లాడి మా మధ్య వైరాగ్యాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూరెడ్డి, బీసీ నాయకత్వాల మధ్య విభేదాలు సృష్టించే విధంగా రాసినవారికి చట్టపరమైన చర్యలు తీసుకోవడం తథ్యమని అన్నారు.ఈ లెటర్ రాసిన వారిపై ఎఫ్ఆర్ఐ కూడా నమోదయిందని ఎస్పీ, డిఎస్పి స్థాయిలో ఇంటరాగేషన్ జరుగుతుందని త్వరలోనేవారిని పట్టుకుని జనం ముందు నిలుపుతామన్నారు. మండల అధ్యక్షులు, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్ మాట్లాడుతూ మా దగ్గర ఎలాంటి కులాలు మతాలు లేవని మాకులం మతం అన్ని కాంగ్రెస్ పార్టీ అని ప్రతిపక్షాలు కుళ్లు రాజకీయాలు చేస్తూ విభజించి పాలించే ధోరణితో మాట్లాడి మా మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. అలాగే ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోళ్ల వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే ప్రయత్నంతో ఐదు మంది రెడ్డిలు ఎమ్మెల్యేకు పోటీ చేసిన ముదిరాజ్ నాయకుడు శ్రీహరికి టికెట్ ఇచ్చేప్రయత్నంలో మొదటి వరుసలో బాలకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి దేనని గెలుపు కోసం వారి సహకారం ఎంతైనా ఉందని వారి గెలుపు ఏనాటికి మర్చిపోలేమని మా స్నేహబంధం ఇలాగే కొనసాగుతుందని అన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డితో శ్రీహరి సాన్నిహిత్యం కుటుంబ సభ్యుల మాదిరిగా ఉంటుందని గుర్తు చేశారు. పనికి మాలిన మాటలు మాట్లాడిన వారిని త్వరలో శిక్షిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో నీలం మధు గెలుపు కోసం ఆయన నియోజకవర్గానికి వెళ్లి ప్రచారం నిర్వహించామని గుర్తు చేశారు. మా మధ్య ఎంతమంది వైషమ్యాలు సృష్టించినా మేము కలిసే పార్టీకి, అధిష్టానానికి కట్టుబడి పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఏ రవికుమార్ ,మండల అధ్యక్షులు మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్,చంద్రకాంత్ గౌడ్ ,మార్కెట్ డైరెక్టర్ రంజిత్ రెడ్డి ,కోళ్ల వెంకటేష్, శివరాంరెడ్డి, ముదుమాల్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ నాయకులు సాలాం,మాజీ నేరడుగం సర్పంచ్ అశోక్ గౌడ్, సంగంబండ మాజీ సర్పంచ్ కేశవరెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

**చిన్నంబావి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బెక్కెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇటీవల విడుదల చేసిన గురుకుల 5 వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలలో పాఠశాల నుండి 5 గురు విద్యార్థులు పరీక్ష రాయగా,4 గురు విద్యార్థులు ప్రతిభ సాధించి సిట్లు పొందారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించినవిద్యార్థులకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. క్రాంతి 87 మార్కులతో చిట్యాల గురుకులలో సీటు సాధించాడు. హర్షిణి 83,ఎస్.పవిత్ర 81 మార్కులతో పెబ్బేరు గురుకులంలో, వి.హేమంత్65 మార్కులతో హన్మకొండలో సీట్లు సాధించి సత్తాచాటారు.గ్రామస్థులు విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలియజేస్తూ 80కి పైగా ముగ్గురు విద్యార్థులు మార్కులు సాధించడం హర్షించదగ్గ విషయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులు పొందిన విద్యార్థులు మంచి ప్రతిభా సాధించారని, పాఠశాల ఉపాధ్యాయులను ప్రశంసించారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు పెంచాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత సురేష్, శివ, శ్రీకాంత్, శేఖర్,అంగన్‌వాడీ టీచర్ జయమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను సన్మానించిన దృశ్యం

## అక్రమ కేసులు అన్యాయం

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** నేషనల్ హెరాల్డ్ పత్రిక నిర్వహణలో భాగంగా యంగ్ ఇండియా ట్రస్ట్ స్థాపించిన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఆమె తనయుడు, లోక్‌భలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తప్పుడు పద్ధతిలో దొడ్డి దారిన అక్రమ కేసులు బనాయించిందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అహ్మద్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన మహబూబ్ నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులు భాగంగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై తప్పుడు కేసులు బనాయించి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగారాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను స్వాతంత్రోద్యమానికంటే ముందే తొలి భారత ప్రధాని జవహర్లాల్ నెహ్రూ స్థాపించారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆ పత్రిక దేశవ్యాప్తంగా కొనసాగిందని పేర్కొన్నారు. పత్రిక నిర్వహణ క్రమంలో ఇన్ ఇండియా సొసైటీని ఏర్పాటు చేసిపత్రిక నిర్వాహణకు నిధులు సమీకరించిన విషయాన్ని బీజేపీ ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించి మచ్చలేని మహానాయకులైన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై దేశ ప్రజల్లో తప్పుడు అభిప్రాయాన్ని కలిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నదని చేసిందని విమర్శించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఉసిగొలిపి వారిని జైలుపాలు చేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు తమ ఐక్యతను చాటాలని, మేధావులు విద్యార్థులు యువత కలిసి కేంద్రంలోని బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని ఈ సందర్భంగా హనీఫ్ అహ్మద్ పిలుపునిచ్చారు.

## ప్రజా సేవకుడు కొప్పుల మధుకు యువతరం స్ఫూర్తి రత్న అవార్డు

**జడ్చర్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** హైదరాబాద్ రవీంద్ర భారతిలో డాక్టర్. బి ఆర్ అంబేద్కర్ గారి 134వ జయంతి వేడుకలలో భాగంగా ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్లు రాజు. చెరుకు రామ చందర్ ప్రజాసేవకుడు కొప్పుల మధుకు యువత స్ఫూర్తి రత్న అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భం గా అవార్డు పొందిన జడ్చర్ల నియోజకవర్గం మిడ్జిల్ మండలం మల్లాపూర్‌కు చెంది కొప్పుల మధు మాట్లా డుతూ అసమానతలపై అవమానాలపై అంటరాని మనువాద మహమ్మారిపై పోరాడిన వీరుడని కొనియా డారు. బావి భారత పౌరుల భవిష్యత్తుకై భారతవని భవిష్యత్తు దిక్కుచూచికై భారత రాజ్యాంగం రచించి సమానత్వ ఫలాలు సమాజానికి సఫలం చేసిన ధీరుడు, దార్శనికుడు, మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి రోజు అవార్డు పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాజ్యాంగం దారిలో అడుగు లేయాలని నవతరానికి ఆదర్శమవ్వాలని అనునిత్యం ప్రజాసమస్యలపై తన పోరాటాలను సామాజిక సేవలను గుర్తించి అవార్డు రావడం సంతోషమన్నారు.



అవార్డు అందుకుంటున్న మధు